# కలం
ప్రజల గళం..

www.kalamdaily.com

Follow on: Kalamtelugu

14-02-2026, శనివారం


360° SINGLE PAGE TOPIC

## కేసులు– ఎంక్వైరీలు

### గొర్రెల స్కామ్




**కేసు:** బీఆర్ఎస్ సర్కార్ హయాంలో 2017లో ప్రారంభమైన గొర్రెల పంపిణీ స్కీమ్ వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడం.. సరఫరా చేసిన గొర్రెలకు సంబంధించిన డబ్బులు చెల్లించలేదని ఏపీకి చెందిన రైతుల ఫిర్యాదుతో 2023 డిసెంబర్‌లో ఏసీబీ కేసు నమోదు. ఏపీ రైతులకు చెల్లించాల్సిన రూ.2.10 కోట్లను అధికారులు, దళారులు కలిసి బినామీ ఖాతాలకు మళ్లించినట్లు గుర్తింపు. ఈ స్కామ్ విలువ దాదాపు రూ.700 కోట్లు ఉంటుందని అంచనా.

**ఈడీ ఎంట్రీ:** రూ.వందల కోట్ల నిధులను దారిమళ్లించినట్టు ఏసీబీ విచారణలో తేలడంతో.. మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేసేందుకు రంగంలోకి దిగిన ఈడీ. 2025 జులైలో హైదరాబాద్‌లోని 10 ప్రాంతాల్లో సోదాలు చేపట్టి, దాదాపు రూ.వెయ్యి కోట్లకు పైగా అక్రమాలు జరిగినట్టు గుర్తింపు.

**ప్రధాన నిందితులు:** నాటి పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ జి.కల్యాణ్ కుమార్, పశు సంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ సబావత్ రాంచందర్, దళారి మొయినుద్దీన్. ఈ ముగ్గురితో పాటు మరికొందరు అధికారులు, కాంట్రాక్టర్లు సహా మొత్తం 17 మందిని అరెస్టు చేసిన ఏసీబీ. నిందితుల్లో కొందరికి బెయిల్.

**ప్రస్తుత స్థితి:** ఏసీబీ, ఈడీ దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నది.




పాత ప్రభుత్వ తప్పుల్ని తవ్వితీయడం అధికార పార్టీలకు రొటీన్ ప్రాక్టీస్. తెలంగాణలోనూ అదే ట్రెండ్. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు జరిగాయన్నది కాంగ్రెస్ వాదన. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న మూడు బ్యారేజీలు గత ప్రభుత్వంలోనే డ్యామేజ్ అయ్యాయి. ఉచిత గొర్రెల పథకం అమలులో అవకతవకలు కూడా అప్పట్లోనే వెలుగులోకి వచ్చాయి. వీటితో పాటు ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో అవినీతి, సీఎంఆర్ఎఫ్ దుర్వినియోగంపైనా ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దర్యాప్తు మొదలుపెట్టింది. కొన్ని అంశాలపై రిటైర్డ్ జడ్జీలతో కమిషన్‌లు నియమించింది. విచారణ అనంతరం ప్రభుత్వానికి నివేదికలూ సమర్పించాయి. కొన్ని కేసుల్ని ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. మరికొన్నింటిలో ఈడీ ఎంటర్ అయింది. పార్టీల పరస్పర విమర్శల కోసం ఈ కేసులు ఉపయోగపడుతున్నాయి. రెండేండ్లు దాటినా ఇవేవీ కొలిక్కి రాలేదు. నిందితులెవరో, బాధితులెవరో తెలియదు. కంచికి చేరకుండా ఉండిపోయిన ఈ కేసుల్లో దోషులెవరో, వారికి పడే శిక్షలేంటో సస్పెన్స్. సా...గుతున్న కేసులు, దర్యాప్తులపై **కలం 360 డిగ్రీస్** స్పెషల్.



- తెలంగాణ బ్యూరో, కలం

### కుంగిన కాళేశ్వరం




**కేసు:** కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ బీఆర్ఎస్ సర్కార్ హయాంలో 2023 అక్టోబర్ 21న కుంగి పోయింది. దీనిపై బ్యారేజీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.రవికాంత్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు.

**విజిలెన్స్ విచారణ:** 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరింది. ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలతో విజిలెన్స్ విచారణకు ఆదేశం. 2024 మార్చి 5న సర్కార్‌కు విజిలెన్స్ విభాగం నివేదిక.

**బ్యాక్ గ్రౌండ్:** 2014లో కేసీఆర్ అధికారంలోకి రాగానే ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైనింగ్ చేసి, కాళేశ్వరంగా మార్చి, అంచనా వ్యయాన్ని రూ.లక్షా 15 వేల కోట్లకు పెంచడం. ఇందులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపణలు.

**జ్యుడీషియల్ కమిషన్:** అక్రమాలపై విచారణకు జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చి 14న జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు.

**కమిషన్ విచారణ:** దాదాపు 16 నెలల పాటు విచారణ చేపట్టిన జస్టిస్ ఘోష్ కమిషన్. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారులు సోమేశ్ కుమార్, రజత్ కుమార్, స్మితా సబర్వాల్, రామకృష్ణారావు, ఇంజనీర్లు సి.మురళీధర్ రావు, వెంకటేశ్వర్లు తదితరుల విచారణ.

**కమిషన్ రిపోర్టు:** దాదాపు 665 పేజీలతో మూడు భాగాలుగా కమిషన్ రిపోర్ట్. 2025 జులై 31న ప్రభుత్వానికి అందజేత.

**సీబీఐకి అప్పగింత:** జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టును 2025 ఆగస్టు 31న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం. దీనిపై చర్చ అనంతరం.. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తున్నట్టు ప్రకటన.

**ప్రస్తుత స్థితి:** కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు, నిధుల దుర్వినియోగం, నిర్మాణ లోపాలు తదితర అంశాలపై విచారణ చేపట్టాలని కోరుతూ 2025 సెప్టెంబర్ 3న కేంద్ర హోంశాఖ, సీబీఐకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ. దర్యాప్తుపై ఇప్పటి వరకు కేంద్రం నుంచి అధికారికంగా వెలువడని ప్రకటన.

# కంచికి చేరని కేసులు




### ఫార్ములా–ఈ కారు రేసు మొదలు.. జీఎస్టీ స్కామ్ వరకు అంతా ఇంతే!

## రెండేండ్లుగా సా...గుతూనే ఉన్న ఎంక్వైరీలు

### జీఎస్టీ గోల్‌మాల్




**కేసు:** తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్ లో కుంభకోణం జరిగినట్లు 2024 జూలై 26న సీసీఎస్‌లో కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ రవి కనూరి ఫిర్యాదు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడం, డేటా చోరీ, ఫోర్జరీ వంటి ఐపీసీ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్. రూ.1,400 కోట్ల స్కామ్ జరిగినట్లు ఆరోపణలు.

**విచారణ సంస్థ:** మొదట సీసీఎస్ అధికారులు విచారించినప్పటికీ.. తర్వాత సీఐడీకి బదిలీ. అదనంగా ఐఏఎస్ ఆఫీసర్ శ్రీదేవి ఆధ్వర్యంలో విచారణ కమిటీ.

**బ్యాక్ గ్రౌండ్:** గత బీఆర్ఎస్ హయాంలో కొన్ని సంస్థలకు ప్రత్యేక పన్ను రాయితీలు ఇచ్చేందుకు అక్రమాలకు పాల్పడ్డట్లు ఆరోపణలు. ఇందుకోసం స్పెషల్ సాఫ్ట్ వేర్‌ను వాడి.. నకిలీ బిల్లులు సృష్టించి ఇన్ పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు నిందలు.

**నిందితులు:** బీఆర్ఎస్ హయాంలో సీఎస్, వాణిజ్యపన్నుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్ కుమార్. వాణిజ్య పన్నుల శాఖ మాజీ అడిషనల్ కమిషనర్ కాశీ విశ్వేశ్వర్‌రావు, అధికారులు శివరామప్రసాద్, శోభన్ బాబు, జీఎస్టీ సాఫ్ట్ వేర్ తయారు చేసిన ప్లింటో టెక్నాలజీ, 75కుపైగా కంపెనీలు.

**అరెస్టులు:** కాశీ విశ్వేశ్వరరావు, శోభన్ బాబు.

**విచారణ:** ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ ను పలుమార్లు విచారించిన సీఐడీ. వాట్సాప్ గ్రూప్ ద్వారా ఆయన ఈ స్కామ్ కు పాల్పడ్డట్లు ఆరోపణలు

**ప్రస్తుత స్థితి:** కొనసాగుతున్న దర్యాప్తు.

### జన్వాడ దావత్



**కేసు:** 2024 అక్టోబర్ 26న అర్ధరాత్రి రంగారెడ్డి జిల్లా జన్వాడలోని ఫామ్‌హౌస్‌పై సైబరాబాద్ ఎస్వోటీ, ఎక్సైజ్ అధికారుల దాడులు. అనుమతి లేకుండా విదేశీ మద్యం, డ్రగ్స్, క్యాసినో నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సోదాలు. మోకిల పీఎస్‌లో ఎన్‌డీపీఎస్ యాక్ట్, తెలంగాణ గేమింగ్ యాక్ట్ కింద కేసు. ఎక్సైజ్ చట్టం కింద కూడా కేసు రిజిస్టర్. ఈ ఫామ్‌హౌస్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు చెందినదిగా గుర్తింపు.

**నిందితులు:** పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఏ1గా రాజ్‌పాకాలా, ఏ2గా రాజ్‌పాకాలాకు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈవో విజయ్ మద్దూరి, ఏ3 ఫామ్ హౌస్ మేనేజర్ కార్తీక్. నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ నేతృత్వంలో కొనసాగిన విచారణ. రాజ్‌పాకాలాను సుమారు 7 గంటల పాటు విచారించి స్టేట్ మెంట్ రికార్డు చేసిన మోకిల పోలీసులు.

**ప్రస్తుత స్థితి:** 2025 డిసెంబర్ చివరి వారంలో చార్జ్‌షీట్ దాఖలు.

### విద్యుత్ అక్రమాలు

**బ్యాక్‌గ్రౌండ్:** బీఆర్ఎస్ హయాంలో చత్తీస్‌గఢ్ నుంచి కరెంట్ కొనేందుకు ఓపెన్ టెండర్ల ద్వారా కాకుండా నామినేషన్ పద్ధతిలో ఒప్పందం చేసుకోవడం. యూనిట్ ధర మార్కెట్ రేటు కంటే ఎక్కువగా చెల్లించడం. దీంతో రాష్ట్ర ఖజానాకు రూ.3 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు ఆరోపణలు. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణాల్లోనూ అక్రమాలు.

**జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్:** కరెంట్ కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణాల్లో అక్రమాలను తేల్చేందుకు 2024 మార్చిలో జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు.

**కమిషన్ విచారణ:** దాదాపు 25 మందికి పైగా కీలక వ్యక్తులను విచారించిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్. నాటి సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వగా.. ఆయన నేరుగా విచారణకు హాజరు కాకుండా 12 పేజీల లేఖలో తన వివరణ పంపారు. ఆనాటి విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి, ట్రాన్స్‌కో అండ్ జెన్‌కో మాజీ సీఎండీ డి.ప్రభాకర్‌రావు తదితరుల విచారణ.

**జస్టిస్ లోకూర్ కమిషన్:** కమిషన్ చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేసీఆర్. దీంతో స్వచ్ఛందంగా విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ నరసింహారెడ్డి. 2024 జులైలో జస్టిస్ లోకూర్ కమిషన్‌ను ఏర్పాటు.

**ప్రస్తుత స్థితి:** ప్రభుత్వానికి రిపోర్ట్ సమర్పణ.



### ధరణి దందా



**కేసు:** గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో తెచ్చిన ‘ధరణి’ పోర్టల్ ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కేసులు. నిషేధిత జాబితాలోని భూములను, అసైన్డ్ ల్యాండ్స్‌ను అక్రమంగా ప్రైవేట్ వ్యక్తుల పేరిట మార్చడం. దాదాపు రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములు చేతులు మారాయని ఫిర్యాదులు.

**నిందితులు:** జనగామ, భువనగిరి జిల్లాల్లో జరిగిన భూఅక్రమాలతో రూ.4 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండిపడినట్లు గుర్తింపు. ఇప్పటి వరకు 15 మంది అరెస్ట్. శామీర్‌పేట, ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల్లో వేల ఎకరాల ప్రభుత్వ భూములను ‘పార్ట్ బీ’ నుంచి మార్చినట్టు వచ్చిన ఫిర్యాదులతో 48 మందిపై క్రిమినల్ కేసులు.

**హైలెవల్ కమిటీ:** ఎం.కోదండరెడ్డి, రేమండ్ పీటర్, సునీల్ కుమార్, మధుసూదన్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్. వేల సంఖ్యలో అక్రమ లావాదేవీలు గుర్తింపు. మిగిలిన 31 జిల్లాల్లోనూ ఆడిట్ చేయాలని నిర్ణయం.

**ప్రస్తుత స్థితి:** ధరణి ప్లేసులో భూభారతి చట్టాన్ని తెచ్చిన సర్కార్. నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వరంగ సంస్థ నేషనల్ ఇన్‌ఫార్మాటిక్స్ సెంటర్ (నిక్)కు అప్పగింత.

### ఫార్ములా కారు రేసు

**కేసు:** 2024 అక్టోబర్18న ఏసీబీకి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఫిర్యాదు.

**దర్యాప్తు సంస్థ :** ఏసీబీ

**బ్యాక్ గ్రౌండ్ :** 2023 ఫిబ్రవరిలో జరిగిన ఫార్ములా – ఈ కారు రేసు ఒప్పందంలో రూ.54.88 కోట్ల అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు.


**నిందితులు:** కేటీఆర్ (A1), అర్వింద్ కుమార్ (A2), బీఎల్ఎన్ రెడ్డి(A3).

**విచారణ:** 2025 జనవరి 9, 16, మే 28, జూన్ 16న కేటీఆర్.. జనవరి 8, జులై 3, సెప్టెంబర్‌లో అర్వింద్ కుమార్.. జనవరి 3, జూన్‌లో బీఎల్ఎన్ రెడ్డి ఏసీబీ ఎంక్వైరీకి హాజరు.

**ప్రస్తుత స్థితి:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ పై చార్జ్‌షీట్ ఫైల్ చేయడానికి 2025 నవంబర్ లో ఏసీబీకి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉత్తర్వులు. సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) డీఎస్పీ మాజిద్ అలీఖాన్ కేసు నమోదు. సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ అర్విందె కుమార్ ఎంక్వైరీకి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర సర్కార్ లెటర్. తుది నిర్ణయం రావాల్సి ఉంది. ఫెమా రూల్స్ కు విరుద్ధంగా విదేశీ కరెన్సీని బదిలీ చేశారన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు. ఈ కేసును సీబీఐకి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయ నిర్ణయం.



### సీఎంఆర్ రైస్ పక్కదారి



**కేసు :** బీఆర్ఎస్ హయాంలో సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) స్కామ్‌లో( 2019 – 2023) సుమారు 22 లక్షల టన్నుల బియ్యం పక్కదారి పట్టించినట్టు గుర్తింపు. దీంతో ప్రభుత్వానికి రూ. 10 వేల కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా. కేంద్రానికి ఫిర్యాదు అందడంతో సీబీఐ విచారణకు ఆదేశం.

**మిల్లుల్లో సోదాలు:** 2025 ఏప్రిల్‌లో మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు చెందిన రైస్ మిల్లుల్లో రూ.70 కోట్ల విలువైన సీఎంఆర్ బియ్యం మాయమైనట్టు గుర్తింపు. తర్వాత విజిలెన్స్ ఆఫీసర్లు 9 జిల్లాల్లోని 19 రైస్ మిల్లులపై దాడులు చేసి, రూ.60 కోట్ల విలువైన ధాన్యం తక్కువగా ఉన్నట్లు గుర్తింపు. కామారెడ్డి సివిల్ సప్లై ఆఫీసుపై ఏసీబీ దాడుల్లో రూ. 44.14 కోట్ల స్కామ్ గుర్తింపు. కోదాడలోని శ్రీవేంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్‌పై ఈడీ దాడులు.. గత పదేండ్లలో రూ.50 కోట్ల బియ్యం పక్కదారి పట్టించినట్టు గుర్తింపు.

**నిందితులు:** తప్పుడు నివేదికలు ఇచ్చిన సివిల్ సప్లై ఆఫీసర్ల అరెస్ట్. బియ్యం అప్పగించని మిల్లర్లకు 25 శాతం అదనపు పెనాల్టీ. అక్రమాలకు పాల్పడిన మిల్లులను బ్లాక్ లిస్టులో పెడ్తూ ఉత్తర్వులు.

**ప్రస్తుత స్థితి:** పౌర సరఫరాల శాఖలోని ప్రతి డేటాను క్రోడీకరిస్తూ సమగ్ర విచారణ నివేదిక విడుదల చేయాలని ప్రభుత్వం ఆలోచన.

### ఫోన్ ట్యాపింగ్

**కేసు:** 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఎస్ఐబీ ఆఫీసులోని డేటాను, హార్డ్ డిస్క్ లను ప్రణీత్ రావు ధ్వంసం చేసినట్లు 2024 మార్చి 10న పంజాగుట్ట పీఎస్‌లో ఎస్ఐబీ అడిషనల్ ఎస్పీ డి.రమేశ్ ఫిర్యాదు. వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా విచారణ.

**బ్యాక్ గ్రౌండ్:** బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టులు, జడ్జీలు, సినీ యాక్టర్స్ సహా అనేక మంది ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు.

**నిందితులు:** మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు, మాజీ అడిషనల్ ఎస్పీ భుజంగరావు, మాజీ డీసీపీ తిరుపతన్న, టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు.

**సిట్:** దాదాపు ఏడాదిన్నరపాటు పలువురు నిందితులను, సాక్షులను స్పెషల్ టీమ్ విచారించగా.. ఆ తర్వాత మరింత లోతైన విచారణ కోసం 2025 డిసెంబర్ 18న సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసిన డీజీపీ.

**బీఆర్ఎస్ పెద్దల ఎంక్వైరీ :** 2026 జనవరి 20న హరీశ్ రావు, 23న కేటీఆర్, 27న సంతోష్ రావు, ఫిబ్రవరి 1న కేసీఆర్‌ను విచారించిన సిట్.

**ప్రస్తుత స్థితి:** హరీశ్, కేటీఆర్, సంతోష్, కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు ఇచ్చేందుకు సిట్ ప్రిపరేషన్స్.

